# బేతాళుడు చెప్పిన లవ్ స్టోరీ



మంగపతిరావ్,
అంజనీ ప్రసాద్

ప్లాటు దొరకని విక్రమార్కుడు తిరిగి చెట్టెక్కి శవాన్ని దించి భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు—జేబులో పెన్ రెడీగా ఉందో, లేదో తడుముకుంటూ. అది చూచిన బేతాళుడు పకపకా నవ్వి, "ఓ! రాజా! ఎన్ని కథలు చెప్పినాకూడా నువ్వు రోజూ పని గట్టుకుని వచ్చి మోస్తున్నావంటే నువ్వేదో బహుమతి పొందగల రచన కోసం పాటుబడుతున్నట్టు కనుపిస్తుంది. అందుకే ఈ రోజు నీకు రిలీఫ్ కోసం ఒక లవ్ స్టోరీ చెబుతాను. శ్రమ పడకుండా ఏ పత్రికకో రాసి పంపుకో" అంటూ గొంతు సవరించుకున్నాడు.

చెవులు రిక్కించాడు విక్రమార్కుడు.

* * * *

ఆలోచనలతో తల పట్టుకుని సోఫాలో కూర్చున్నాడు జగన్నాథం.

కవిత అంత తెగించి సమాధానం చెబుతుందనుకోలేదు. ఎలా? ఈ ప్రేమ వ్యవహారం తన చెయ్యి దాటిపోయేలా ఉందే? అసలు ఇంత కాలం పూరుకోవడమే తప్పయింది. వాళ్ళ ప్రేమాయణం గురించి చూచాయగా తెలియగానే గట్టిగా కేకలు వెయ్యవలసింది!

ఇప్పటికైనా మించిపోయిందిలేదు. తమ స్టేటస్‌కు తగ ధనవంతుల సంబంధం ఏదో ఒకటి చూసి వెంటనే కవిత పెళ్ళి కానిచ్చేయ్యాలి. ఆ కుమార్‌గాణ్ణి కనక కవిత చేసుకుంటే తన పరువేం గాను? సాటి వారిలో తన స్టేటస్ తగ్గితే తల ఎత్తుకు తిరగగలడా? వాడి తండ్రి తాతల దగ్గరి నుంచి తమ మోచేతి కింద నీళ్ళు తాగి బతికిన వాళ్ళు. ఈ రోజు వీడు ఏవో నాలుగక్షరమ్ముక్కలు ఒంటబట్టి ఆఫ్టరాల్! లెక్చరర్ ఉద్యోగ చేస్తూ, తన స్టేటస్ ఏమిటో గుర్తించకుండా మచ్చ తేవాలని చూస్తాడా? ఎంత ధైర్యం! అనుకుంటూ ఆలోచిస్తూనే ఉన్నాడు జగన్నాథం, పైపు గుప్పు గుప్పున పీలుస్తూ.

తన ప్రేమ విషయమై ఆ సాయంత్రం జరిగిన రభస గురించే మేడ పైన బాల్కనీ స్తంభానికి ఆనుకొని తీవ్రంగా ఆలోచిస్తోంది కవితకూడా. ముఖమంతా దిగాలుగా వాడిపోయి ఉంది. కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి.

రోడ్డు మీద జన సంచారం పెద్దగా లేదు. ఉండి ఉండి ఒకటి రెండు కార్లు మగతగా తిరుగుతున్నాయి. నగరాన్ని వెలుగులో నింపేందుకు వీధి దీపాలు వృధా ప్రయత్నం చేస్తున్నాయి.

ఆలోచనల నుంచి తేరుకుందుకు గదిలోకి వచ్చి బద్ధకంగా పక్క మీద వాలి పక్కనే ఉన్న ఫేజ 'లైక్ ఎ హోల్ ఇన్ ద హెడ్' అందుకుంది.

శీతాకాలపు చలిగాలి రివ్వున వీస్తోంది.

నవలపై చూపులయితే ఉన్నాయి కాని, ఆలోచనలు తలను దొలిచి వేయసాగాయి. తను అనుకున్నంతా అయింది. తండ్రి ఈ పెళ్ళికి అంగీకరించడని తనకు ముందే తెలుసు. అయినా నెమ్మదిగా చెప్పి ఒప్పించాలనుకున్నదల్లా ఈ రోజు తండ్రే డైరెక్టుగా అడిగి, వీలు లేదని బెదిరించే సరికి తనూ మొండిగా కుమార్‌ను తప్ప మరొకరిని చేసుకునేది లేదని చెప్పేసింది.

స్క్రీన్ చదవండి

సుప్రసిద్ధ సినిమా వార పత్రిక




అందానికి, మన్నికకు

అమర్

గోల్డు కవరింగు ఆభరణములనే ధరించండి

5 సం॥లు గ్యారంటీ

సుపరిచితమైన ఫోర్‌హాన్స్




ఫ్లోరైడ్ గల

ఫోర్‌హాన్స్

టూత్‌పౌడర్

మెరిసే పళ్లతోపాటు ఆరోగ్యవంతమైన చిగుళ్లకూడా ఎంతో అవసరం. ఫ్లోరైడ్ గల ఫోర్‌హాన్స్ టూత్‌పౌడర్ పళ్లను శుభ్రపరచడంతోపాటు, చిగుళ్లను కూడా సురక్షితంగా ఉంచుతుంది. టూత్‌పౌడర్ కావివ్వండి టూత్‌పేస్ట్ లేదా టూత్ బ్రష్ కావివ్వండి. అందరికీ తెలిసినది ఫోర్‌హాన్స్

దంతవైద్యుల చేయుచున్న మనుకుమిత్రులు

2236-152-R


ఉవింత ధైర్యంగా చెప్పింది! తనకే ఆశ్చర్యంగా ంది ఇప్పుడు.

ఏమైనా సరే తను కుమార్‌ను వదులు కోదు.

అసలు కుమార్‌తో తన తొలి పరిచయం. ఎంత మధురమైన రోజులు! తీయని గతం లోకి జారి పోయింది మనసు.

* * * *

"ఇవాళ మనకు హిస్టరీకి కొత్త లెక్చరర్ ఎవరో వస్తాడట." క్లాసు రిప్రజెంటేటివ్ అనౌన్స్ చేసింది ఒక రోజు క్లాసులో అడుగు పెడుతూనే.

చాలా ట్రిమ్‌గా అలంకరించుకుని ఉంది, రోజూ కంటే ప్రత్యేకంగా.

"మ్యారీ అయింది కాదా?" ఎవరికో డౌట్.

"అవును. యూనివర్సిటీ రాంక్ హోల్డర్. బాగానే చెప్తాడేమో?"

వానిటీబాగ్‌లోంచి చిన్న మిర్రర్ తీసి అలంకరణ చూసుకుంటూ బదులు చెపుతూంది.

"రెండు రోజులు చూద్దాం, సరిగా చెప్పకపోతే ఆట పట్టించెయ్యడమే."

రాబోయే లెక్చరర్‌ను ఆట పట్టించడ మెలా ఉన్నా, ముం దా రిప్రజెంటేటివ్ అమ్మాయిని ఆట పట్టించేయసాగారు అందరూ కలిసి, ఆమె ప్రత్యేకాలంకరణను మెచ్చుకుంటూనే.

కామెంట్లు వింటూ ఆఖరి బెంచీలో మవునంగా కూర్చుంది కవిత.

మొదటి రెండవర్లూ మామూలుగా సాగిపోయాయి. థర్డ్ అవర్ హిస్టరీ.

క్లాసులో కోలాహలం పెరిగింది. రాబోయే లెక్చరర్ కోసం అంతా కళ్ళింత చేసుకుని ఎదురు చూస్తున్నారు.

బూట్లు టకటక శబ్దం చేసుకుంటూ క్లాసుకు వచ్చాడు కుమార్. బ్లూ పాంట్‌లో తెల్లటి డిజైన్ షర్టు టక్ చేసుకున్నాడు. అమ్మాయిలు జాగ్రత్తగా పరిశీలించ సాగారు కొత్త లెక్చరర్ని.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్స్!" సరళంగా పలికి రోల్ కాల్ పూర్తి చేశాడు క్షణాల్లో. అటెండెన్స్ రిజిస్టరు మూసి, ఒక పక్కను పెట్టి లేచాడు. క్లాసంతా పరిశీలనగా చూశాడు. అక్కడక్కడా గుసగుసలు, ముసి ముసి నవ్వులు గమనించాడు.

"ఎస్?"

గంభీరంగా పలికేసరికి క్లాసంతా అటెంటివ్‌గా మారింది.

"లెట్ మీ ఇంట్రడ్యూస్ మై సెల్ఫ్. మై నేమ్ ఈజ్ కరుణ్‌కుమార్. ఎం. ఎ, ఫ్రమ్ ఆంధ్రా వర్సిటీ, సెక్యూరింగ్ సెకండ్ రాంక్. విల్ బి ఎంగేజింగ్ యువర్ హిస్టరీ క్లాస్ ఫ్రం నౌ అన్‌వార్డ్స్ ఎక్స్‌పెక్టింగ్ యువర్ కైండ్ కోపరేషన్!" అంటూ తనను తాను పరిచయం చేసుకుని అందరి పేర్లూ అడిగి తెలుసుకున్నాడు చిరునవ్వుల మధ్య. తరవాత సలబై నిమిషాల పాటు ఆ ఏడాది సిలబస్ ఇన్‌ట్రడక్షన్ ఇచ్చాడు, అనర్గళమైన ఇంగ్లీషులో, క్లాసులో ఎవ్వరూ కిక్కురు మనలేదు.

హిస్టరీ కూడా ఇంత ఇంటరెస్టింగ్‌గా ఉంటుందా అని ఆశ్చర్యపోయారంతా. త్వరలోనే విద్యార్థినులందా కుమార్ అంటే ఆకర్షణ పెంచుకున్నారు. డౌట్స్

క్లియర్ చేసుకునే నెపంతోనూ, రిపెరెన్సు పుస్తకాలడిగే నెపంతోనూ, మరేదో వంకతోనూ కుమార్‌ను ఎక్కువగా కలుసుకుంటూ ఉండేది కవిత. అతడు మాత్రం బెరుకుగా ఉండేవాడు.

ఎప్పుడన్నా కుమార్ లీవ్ పెడితే క్లాసంతా బోర్ ఫీలయి ఎందుకీ వేళ కాలేజి కొచ్చామురా, భగవంతుడా! అని తిట్టుకునేవారు. అలాంటి కుమార్ ఒకసారి వారం రోజులు వరసగా రాకపోయేసరికి అందరికీ పిచ్చెక్కి నట్టయింది.

ఇక కవిత సంగతయితే చెప్పనే అక్కర్లేదు.

ఆ రోజు సాయంత్రం ఏం తోచక దగ్గరలో ఉన్న పామ్ బీచ్‌కి బయలుదేరింది కారులో నెమ్మదిగా డ్రయివ్ చేసుకుంటూ.

రాక్స్ పక్కనే ఇసుకలో కూర్చుని సముద్రాన్ని తదేకంగా చూస్తున్న కుమార్ని గుర్తించింది.

ఆనందానికి అవధులు లేవు. గబ గబా ఆ వైపు నడిచింది.

"గుడ్మార్నింగ్, సర్!" విష్ చేస్తూ కూర్చుంది అక్కడనే. ఉలిక్కిపడి చూచిన కుమార్ కంగారుపడి కాస్త దూరంగా జరిగి ప్రత్యుత్తర మిచ్చాడు—"ఓ మిస్ కవితా!" అంటూ.

"ఏమిటి ఇలా వచ్చారు?" మళ్ళీ తనే అడిగాడు వెంటనే.

"ఏం లేదు కాని, మీ రెక్కడికి వెళ్ళారండీ—లీవ్ పెట్టారు?" కవిత కుతూహలంగా అంది. కుమార్ సమాధానం చెప్పక తేల్చేశాడు. "ఏమండీ" అంటూ.

"మీరు రాకపోతే మా కెంత బోర్ కొట్టిందో తెలుసా?" గబుక్కున అనేసి నాలుక కరుచుకుంది కవిత.

"నేను రాకపోతే బోర్ కొట్టిందా? వండర్! ఎందుకు?" నవ్వుతూ అన్నాడు కుమార్.

సమాధానం లేని ప్రశ్న. కవిత తల వంచుకుంది మౌనంగా. కాస్సేపాగి చూచిన ఆమె కుమార్ మళ్ళీ ఆలోచనల్లో పడడం గమనించింది.

"ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు, కవితా! ఇలా కూర్చుని సముద్రాన్ని తదేకంగా చూడ్డం నా కెంతో ఇష్టం" అన్నాడు వేదాంతిలా.

చిలిపిగా చూసింది కవిత కుమార్ని. ఎన్నాళ్ళనుంచో అడుగుదామనుకుంటున్న వ్యక్తిగతమైన వివరాలు అడిగింది. ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

బాగా చీకటి పడింది. జనం పలుచబడ్డారు. "వెళదాం, కవితా!" లేచాడు కుమార్.

నెమ్మదిగా రోడ్డు మీదికి వచ్చారిద్దరూ.

గాలి పెద్దగా వీస్తూండడంతో కవిత పైట చెంగు కుమార్ని కావిలించేందు కన్నట్టుగా అతని మీదికి పరుగులు తీస్తూంది. కవిత ఎంత నిలువరించుకు న్నా లాభం లేకపోతూంది.

"ఇల్లెక్కడ, సర్?"

"ఇల్లు కాదు, రూమ్. డాబా గార్డెన్స్."

"డ్రాప్ చేస్తా రండి." కారి డోర్ తెరిచి ఆహ్వానించింది.

"అబ్బే! ఎందుకు? చిన్న వాల్తేరు నుంచి బోలెడు బస్సులు." తప్పించుకోబోయాడు కుమార్.



## ఎవరి లోపం?

ఒక యువకుడు కంటి డాక్టరు వద్దకు పరుగు పరుగున వచ్చి "డాక్టరుగారూ. . . నా కళ్ళ కేదో జబ్బు చేసిందండీ. సరిగా కనపడటం లేదు" అన్నాడు.

"కనబడని వాడివి ఇంత దూరం ఎలా వచ్చావయ్యా?" అని డాక్టరు ఎదురు ప్రశ్న వేశాడు.

"పెద్ద పెద్ద వస్తువులు బాగానే కనిపిస్తున్నాయి, సార్. కానీ చిన్న చిన్నవి కనబడ్డం లేదు" అన్నాడు యువకుడు.

డాక్టరు అతన్ని పరీక్ష చేసి "ఏ జబ్బూ లేదు. కళ్ళు శుభ్రంగా ఉన్నాయి. అంతా నీ కంగారు" అన్నాడు.

"మరయితే పరీక్షా ఫలితాలు వచ్చిన పేపర్లో నా నంబరు ఎంత చూసినా కనబడ లేదే?" అని వాపోయాడు యువకుడు.

—భారతి

"బస్సులు ఉండవని కాదు. కారు ఉందిగా? రండి, సరదాగా వెళదాం."

కారెక్కక తప్ప లేదు కుమార్‌కు. స్టీరింగ్ ముందు కూర్చున్న కవితను చూస్తూ అమాయకంగా ప్రశ్నించాడు—"డ్రయివింగ్ నేర్చుకుని ఎన్నాళ్ళయింది?" అని. కవిత సమాధానంగా నవ్వింది.

"మీ ప్రాణాలకేం ముప్పు ఉండదు లెండి. జాగ్రత్తగా తీసుకువెళ్ళే పూచీ నాది."

బయలుదేరిన కారు త్రీ స్టార్ హోటల్ ముందు ఆగింది. కవిత వంక చూశాడు కుమార్. ఇగ్నిషన్ కీ చేతిలోకి తీసుకుంటున్న ఆమెతో అన్నాడు—

"నా అడ్రెస్ ఈ హోటల్ కాదు. డాబా గార్డెన్స్" అని.

"తెలుసండి. జస్ట్ కాఫీ తీసుకుందాం."

నవ్వులా కారు దిగిన కవితతో తనూ దిగక తప్ప లేదు కుమార్‌కు. తను ఆఫర్ చేయవలసింది పోయి ఆ అమ్మాయి రమ్మంటూంటే జంకుతున్నా ననుకుంటున్నాడు మనసులో.

"ఇకనైనా ఎక్కడా ఆపకుండా తీసుకుపోతావా లేకపోతే బస్సులో పొమ్మంటావా?" చిరుకోపం నటిస్తూ అన్నాడు కుమార్, బయటికి వచ్చాక.

ఆ కాస్సేపట్లోనే వాళ్ళిద్దరి మధ్య బెరుకుపోయి చనువు చోటు చేసుకుంది.

"నో ప్లీజ్! టు మినిట్స్" అంటూనే కారు స్టార్టు చేసింది. అలవాటు ప్రకారం కాఫీ కాగానే



సిగరెట్ ముట్టించవలసిన కుమార్ ఆ అమ్మాయి ఏమనుకుంటుందోనని కోర్కెను బలవంతంగా అపుకున్నాడు. చదువు గురించి అడిగితే నిర్లక్ష్యంగా ఏదో సమాధానా లిస్తున్న కవితను చూసి నవ్వుకుని రోడ్డు వైపు దృష్టి మరలించాడు. చాలా చక్కగా డ్రయివ్ చేస్తూంది కవిత.

"ఆ, ఈ సందులోనే రెండవ ఇల్లు."

కారు సందు మలుపు తిరిగి ఆగింది. కుమార్ కారు దిగి కొద్దిగా వంగి కవితతో—"మరి నే వెళతా. మెనీ ఏ థాంక్స్ అండ్ గుడ్ నైట్, మిస్ కవితా!" అని చెప్పి లోనికి నడవబోయాడు.

"కనీసం లోపలి కయినా ఆహ్వానించరా?"

"నా కయితే అభ్యంతరం లేదు కాని, ఇంటి వాళ్ళెవరైనా చూశారంటే నే నింకో రూమ్ చూసుకోవలసి వస్తుందేమో!" చిలిపిగా అన్నాడు.

ఫక్కున నవ్వింది కవిత. "పోనీలెండి. మొదటి పరిచయంలోనే మీ కన్ని కష్టాలు తెచ్చి పెట్టను. గుడ్ నైట్!"

మరొకసారి కుమార్ వంక దీకంగా చూసి కార్ బాక్ చేసి రోడ్ మీదికి దూసుకుపోయింది.

ఉలిక్కి పడిన కుమార్ ఒక్క క్షణం కారు వెళ్ళిన దారి వంకే చూస్తూ లోనికి నడిచాడు.

వారిద్దరి పరిచయం రాను రాను బాగా పెరిగింది. వీలైనప్పుడెల్లా బీచ్‌లో కలుసుకునే వారు. చివరికి ఒక రోజు కవిత భయపడుతూనే అసలు విషయం అతని ముందు ఉంచింది.

"ఐ టూ డు లవ్ యు కవితా! బట్ మన పెళ్ళి మాత్రం నెక్స్టు ఇంపాజిబిలిటీ!" అన్నాడు కుమార్ రాబోయే అడ్డంకు లన్నీ ఊహించినట్టుగా.

"నో, కుమార్! ఏమైనా సరే మన పెళ్ళి జరిగి తీరుతుంది. మీరు రంగీకరిస్తే చాలు. లెటజ ఫేస్ ది ఈవిల్ సర్కమ్‌స్టెన్సెస్ విత్ కరేజ్!" అంటూ ఉత్సాహంతో పొంగి పోయింది. ఆనందంగా కుమార్ ఒడిలో వాలిపోయింది.

• • •

"టక టక" తలుపు తట్టిన శబ్దమూ, "అమ్మాయిగారూ!" అన్న పిలుపూ కవిత మధుర స్మృతులను ఆనకట్ట వేశాయి. కమ్మనైన జ్ఞాపకాలకు అంతరాయం కలిగిన చిరాకులో గబగబ వెళ్ళి తలుపు తీసింది.

"భోజనం, అమ్మాయిగారూ!" పని కుర్రవాడు అంటున్నాడు.

"సరే. వస్తున్నా పద." అంటూ అటాచ్డ్ బాత్‌లో దూరింది, చల్లగా స్నానం చేసేందుకు. షాంపూ బాత్ కానిచ్చి బయటికి వచ్చేసరికి ఆ సాయంత్రం తండ్రితో పడిన గొడవ మరిచిపోయి ప్రశాంతంగా ఉంది.

మాక్సీ వేసుకుని డైనింగ్‌హాల్‌కు నడిచింది.

• • •

రోజులు భారంగా గడుస్తున్నాయి.

కవిత చాలా సీరియస్‌గా ఆలోచిస్తూంది. ఈ ప్రాబ్లమ్ ఎలా సాల్వ్ చెయ్యాలా అని. తండ్రి తీసుకు వచ్చే సంబంధాలలో హోదా, అంతస్తు ఉండవచ్చునేమో కాని, కుమార్ లాంటి సహృదయుడు దొరకటం కష్టం. ఏమైనా తను కుమార్‌ను వదులు




# సత్వర నివారణకు శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ తీసుకొనండి.

**బలీయమైనది!** అనాసిన్ నొప్పిని త్వరితంగా తగ్గిస్తుంది ఎందువలనంటే ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థాలను అది ఎక్కువగా కలిగియున్నది.

**విశ్వసనీయమైనది!** అనాసిన్ డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా ఒక మందుల మిశ్రమం. అందువల్లనే లక్షలాది ప్రజలు అనాసిన్‌ను తీసుకొంటారు మరియు సిఫారసు చేస్తారు.

*జలుబులు మరియు ఫ్లూ, తలనొప్పి, పడుము నొప్పి, కండరాల నొప్పి మరియు పంటి నొప్పికి బాగా పనిచేస్తుంది*




భారత దేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారిణి
జెఫ్రీ మేనర్స్ వారి అనాసిన్ విభాగం నుంచి

*Regd. TM

కోలేదు. కుమార్‌తో పెళ్ళికి తండ్రి ఎలాగూ ఒప్పుకోడనేది తెలుస్తూనే ఉంది. ముందు తాను కుమార్ని చేసేసుకుంటే కాలక్రమేణాఅన్నీ అవేసర్దుకుంటాయి. ఏమైనా తను ఇనిషియేటివ్ తీసుకోవాలి. కుమార్ని పెళ్ళికి ఒప్పించి తండ్రికి తెలియకుండానయినా చేసేసుకోవాలి.

జగన్నాథం కూడా ఇందుకేమీ తీసిపోలేదు. అతనంతకంటే సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు కవిత విషయం. ఎందుకంటే ఇది అతని స్టేటస్ కు సంబంధించిన విషయం కనక. ఒక్కగానొక్క కూతురు పెళ్ళి సంసులో అతని ప్రతిష్ఠ పెంచేదిగా ఉండాలతనికి.

తన కవిత ఆ పూర్ లెక్చరర్ని అందునా ఇంటర్ కాస్ట్ మారేజి చేసుకోవడానికి వీలులేదు. ఏదో ఒక పెద్ద సంబంధం వెంటనే కుదిర్చి పెళ్ళి చేసెయ్యాలి. తనిప్పుడే మంచి ఉపాయం ఆలోచించాలి. ఈ లోగా కవిత చేస్తున్న ప్రతి పనీ గమనించాలి. కుమారూ, కవితా కలిసి ఏ అఘాయిత్యమూ చెయ్యకుండా ఒక కంట కనిపెడుతూ ఉండాలి అని నిశ్చయించుకున్నాడు.

కవిత మాత్రం కుమార్ని కలవడం మానలేదు.

ఆ రోజు జగన్నాథం ఇంట్లోనే ఉన్నాడు. గోడ గడియారం మూడు కొట్టింది. తరవాత రెండు మూడు నిమిషాలకు హాలో ఫోన్ రింగయింది.

పని కుర్రవాడు అందుకున్నాడు.

"కయితమ్మ గోరాండి. నిద్దరోతున్నారు. నేన్మంటారా?" తరవాత చాలా సేపు "ఊ" కొట్టాడు.

"ఆల్లేనండి! ఆల్లేనండి! ఆల్లే సెబ్తానండి." ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కణ్ణించిరా ఆ ఫోను?" గదిలో పచార్లు చేస్తున్న జగన్నాథం హాల్లోకి వచ్చాడు.

"కయితమ్మగోరి కోసరమండి! ఒరో కుమారు గోర్ట—సందేల ఆరింటికల్లా బీచికి వచ్చీమని కబురు సేశారండి. ఈ యిసయం అమ్మాయిగోరితో దప్ప ఒరితో సెప్పే ఒద్దని సెప్పారండి!" అమాయికంగా అంతా వివరించాడు వాడు.

"హు!" అని గదిలోకి తిరిగి వచ్చేశాడు జగన్నాథం. ఎన్నడూ లేనిది ఇంటికే ఫోను చేశాడంటే? అతనికేదో అనుమానం వచ్చింది. మొత్తానికి వీళ్లేదో ఎత్తులో ఉన్నారు. అసలు వాళ్ళ ప్లాన్ ఏమిటో తెలుసుకోవాలి. సాయంత్రం వాళ్ళను జాగ్రత్తగా ఫాలో అయి వాళ్ళు ఏం చెయ్య బోతున్నారో తెలుసుకోవాలి. మొత్తానికి మంచి అవకాశం దొరికింది అనుకున్నాడు హుషారుగా జగన్నాథం.

ఫోన్ కాల్ వచ్చిందని తెలియడంతోనే అయిదున్నరకే టాయిలెట్ అయి హడావిడిగా బయలుదేరింది కవిత. వెంటనే కారులో ఫాలో అయ్యాడు జగన్నాథం.

కుమార్‌ను కలుసుకుని ఆ రోజు కవిత ఇంటికి తిరిగి వచ్చేసరికి ఎనిమిది దాటింది. హుషారుగా హాల్లోకి వచ్చేసరికి జగన్నాథం సోఫాలో కనుపించాడు. మళ్ళీ ఏం తిడతాడో నన్న భయంతో బిగుసుకు పోయింది.

అదేమీ పట్టించుకోలేదు జగన్నాథం. కవిత కోసమే ఎదురు చూస్తున్నట్టుగా చిరునవ్వుతో పలక

రించాడు — "రా అమ్మా, కవితా! కొద్దిగా ఆలస్య మైనట్టుందే?" అంటూ. ఆశ్చర్యపోయింది కవిత.

జగన్నాథం తనను ఫాలో కావడం, తనకంటే ముందే ఇంటికి చేరడం— ఇవేమీ కవితకు తెలియదు.

ఆలస్యంగా ఇంటికి వస్తూందని రోజూ తిట్టేవాడల్లా ఈ వేళ నవ్వుతూ పలకరించడం కవితకు వింతగా కనుపించింది. ఒకవేళ ఏదైనా సంబంధం కుదిరి ఈ వేళ తనను బుజ్జగించి, హితబోధ చెయ్యడానికి కాదు కదా? అనుకుని — "కుమార్‌ను పెళ్ళిచేసుకోవాలనే నా నిశ్చయంలో ఎలాంటి మార్పూ ఉండబోదు, నాన్నా!" అంది, తండ్రివంకే అనుమానంగా చూస్తూ.

జగన్నాథం నవ్వాడు.

"సరే. నీ ఇష్టప్రకారమే కానియ్యమ్మా. నీ సుఖ శాంతులే నాకు ముఖ్యం."

నిర్ఘాంతపోయింది కవిత — "నాన్నా!" అంటూ.

ఏమిటీ వింత?! నిన్నటిదాకా ఈ పెళ్ళి జరిగితే గడప తొక్కనవసరం లేదన్న మనిషి ఇప్పుడు తానే ఒప్పుకుంటున్నాడేమిటీ?

"ఇంకా ఆలోచన దేనికమ్మా? ముహూర్తం త్వరలోనే పెట్టించేద్దాం. నాకూ ఒక బాధ్యత తీరిపోతుంది. ఈ లోగా నువ్వు వెడ్డింగ్ కార్డులూ అవీ సెలెక్ట్ చేసుకుని, నీకు నచ్చిన నగలూ, బట్టలూ కొనుక్కో అమ్మా! ఈ సమయంలో మీ అమ్మే కనక ఉంటే ఎంత సంతోషపడేదో!" చివరి మాటలు అంటూంటే బొంగురుపోయింది జగన్నాథం కంఠం.

"పోనీలెండి, నాన్నా! అవన్నీ ఇప్పు డెందుకు గుర్తు చేసుకోవడం? మీరీ పెళ్ళికి ఒప్పుకున్నారు. అంతేచాలు" అంది కవిత తన అదృష్టానికి మురిసిపోతూ.

కుమార్‌ను అల్లుడుగా చేసుకుంటున్న జగన్నాథాన్ని చూసి అంతా మరింత అసూయ పడ్డారుకూడా.

• • •

భేతాళు డింతవరకూ కథ చెప్పి. "ఓ రాజా సాధారణంగా ఇటువంటి ప్రేమ కథలన్నీ ట్రాజెడీలు గానే ముగుస్తాయి. కాని, ఎక్కడా చూడని విధంగా నేను చెప్పిన ప్రేమ కథ కామెడీ కావడం చూశావు పెళ్ళితో. అయితే మొదటనుంచీ కుమార్‌తో కవిత పెళ్ళికి వ్యతిరేకంగా ఉన్న జగన్నాథం సడన్‌గా తన నిర్ణయం మార్చుకుని తానే ఈ పెళ్ళి జరిపించా డెందుకు? స్టేటస్ కోసం పాకులాడే జగన్నాథం వంటి వ్యక్తి ఇలా ధనంలోనూ, కులంలోనూ తన కేవిధంగానూసాటిరాని కుమార్‌నుఎందుకు అల్లుడుగా చేసుకున్నాడు? పైగా కుమార్‌ను అల్లుడుగా చేసుకున్న జగన్నాథాన్ని చూసి అందరూ ఎందుకు అసూయ పడడం? ఇవన్నీ వింతగానూ, అర్థం కాకుండానూ లేవా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసి చెప్పకపోయావో కథ రాసుకునేప్పుడు నీ పెన్ పాళీ వేయి ముక్కలవుతుంది— జాగ్రత్త!" అన్నాడు.

విక్రమార్కుడు హాయిగా నవ్వాడు.

"భేతాళా! లవ్ స్టోరీల విషయం నీకు బొత్తిగా తెలియకపోవడంచేతనే అవన్నీ వింతగానూ, అర్థం కాకుండానూ ఉన్నాయి. ఇకపోతే. జగన్నాథం కూతుర్ని ఫాలో అవుతూ ఒక రోజు బీచ్‌కి వెళ్ళాడన్నావు— గుర్తుందా? నీ డవుట్స్ క్లారిఫై చేసేందుకు అక్కడ జరిగిన ఒక విశేషం చెబుతాను. విను" అన్నాడు.

• • •

ఆ రోజు సాయంత్రం వాళ్ళ ప్లాన్ ఏమిటో తెలుసుకుందామని బీచ్‌కి వెళ్ళాడు జగన్నాథం కవిత వెనకనే. శీతాకాలం. పైగా ఆరు కావస్తూండడంతో చీకట్లు అలుముకున్నాయి. కవిత, కుమార్‌లకు కొంచెం దూరంలో జగన్నాథం కూర్చోవడం వాళ్ళు గమనించనేలేదు.

"ఏమి టింత ధైర్యం చేశారు హీరోగారు!" కవితే ప్రారంభించింది కూర్చోగానే. "డైరెక్టుగా ఇంటికే ఫోన్ చేశారట — నన్నిక్కడికి రమ్మని. అదృష్టం బాగుండబట్టి కాని, లేకపోతే ఆ కాల్ మా నాన్నే రిసీవ్ చేసుకుని ఉంటే!"

మరికాస్త దగ్గరగా జరిగాడు జగన్నాథం వాళ్ళ మాటలు బాగా వినేందుకు, ఒక బండను చాటుగా చేసుకుని. మాటలు బాగానే వినిపిస్తున్నాయి—అనుకున్నాడు.

"నా కామాత్రం తెలియదనుకుంటున్నావా,కవితా? అతను మీ నౌకరని తెలిశాకే అసలు విషయం చెప్పాను."

"అసలింతకూ సంగతేమిటో?"

"చెబితే నా కేమిస్తావ్?" వింతకాంతి కళ్ళలో మెదలాడగా అన్నాడు కుమార్.

"మీరేం అడిగితే అది!" అదోకలా చూస్తూ జవాబిచ్చింది కవిత.

ఒక్కక్షణం ఆగి అన్నాడు కుమార్ : "నేను ఐ. ఏ. ఎస్. కు సెలెక్టయ్యాను. మధ్యాహ్నమే ఇంటిమేషన్ వచ్చింది."

కుమార్ ఐ. ఏ. ఎస్. పాసయ్యానని చెప్పగానే జగన్నాథం గుండె ఆగినంత పనయింది.

కవిత అనుకోని ఈ వార్తకు ఉక్కిరిబిక్కిరి అయింది.

" క్లవర్ యు ఆర్! హార్టీ కంగ్రాచ్యులేషన్స్!!' అంటూ కుమార్‌ను చేతులతో చుట్టేస్తూ ఆనందంతో కుదిపేసింది. కవితకు పట్టలేనంత సంతోషంగా ఉంది. కుమార్ మామూలుగానే ఉన్నాడు.

"కొన్నాళ్ళ క్రితం ఏదో పనిమీద ఢిల్లీ వెళ్ళావన్నావ్ — ఇందుకేనా? చాలా అన్యాయం. ఐ. ఏ. ఎస్. కు వ్రాశానని నాతో ఒక్కసారి చెప్పలేదేం?" నిష్ఠూరంగా అంది కవిత అంతలోనే.

"సారీ, కవితా! రిజల్ట్ వచ్చాక శుభవార్త ఒకేసారి చెబుదాం, లేకపోతే కామ్‌గా ఊరుకుందామని నీకే కాదు—ఎవరికీ చెప్పలేదు. ఆఖరికి రిటెన్ పాసయినప్పుడు కూడా ఎవరికీ చెప్పలే."

"గొప్పపని చేశారు కాని, పార్టీ ఎప్పుడు?" అంది దబాయింపుగా.

"పార్టీ కాదు — పెళ్ళెప్పుడని అడగాలింక." హుషారుగా అన్నాడు.

సిగ్గుపడింది కవిత.

"అరె! ఎప్పుడూ లేని సిగ్గేమిటి? సరే, పద. నీ త్రీస్టార్ హోటల్‌కి పోదాం. పార్టీ అంటున్నావుగా?"

ఇద్దరూ నవ్వుకుంటూ లేచారు.

జగన్నాథం ఆలోచనలో పడ్డాడు.

కవితకు తను వెదికే సంబంధాల్లో ఎవరికీ లేనంతగా తన స్టేటస్ పెంచగల అర్హత కుమార్‌కు ఉందిప్పుడు. అందుకనే మిగతా విషయాలన్నిటిగూర్చి ఆలోచించక కుమార్‌ను తన అల్లుడుగా చేసుకోవడానికి నిశ్చయించుకుని మెల్లగా ఇంటికి బయలుదేరాడు జగన్నాథం.

• • •

"జగన్నాథం వంటి వ్యక్తులు ఎంతసేపూ సంఘంలో తమ స్థానం కొరకే ప్రాకులాడేది. ప్రేమ కథలకు పెద్దవాళ్ళు అడ్డు వస్తున్నారంటే అది తమ సోషల్ స్టేటస్‌కు భంగం కలుగుతుం దనుకున్నప్పుడే. ఈ భయమే అన్ని ట్రాజెడీ కథలకూ మూలం. కులం, గుణం పైకి చెప్పే సాకులు మాత్రమే. పెద్దవాళ్ళ స్టేటస్‌కు భంగం కలుగని నాడు ప్రతి లవ్ స్టోరీ కామెడీ కాగల దనడానికి పై పెళ్ళే నిదర్శనం" అంటూ ముగించాడు విక్రమార్కుడు.

తల తిరిగిన భేతాళుడు ఒక్క క్షణం చెట్టెక్కడం మరిచిపోయి, అంతలోనే గుర్తు వచ్చి ఎగిరి యథాస్థానం చేరుకున్నాడు. ★

